క్లుప్తంగా

రేపు శోభా యాత్ర

కడప రూరల్: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఈ నెల 16వ తేదీన కడప నగరంలో నిర్వహించే శోభా యాత్రను జయప్రదం చేయాలని ఛత్రపతి శివాజీ మరాఠా సేవా సంఘ్ ఐక్య వేదిక గౌరవాధ్యక్షులు ఏ. వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నగరంలోని అంబాభవాని ఆలయం నుంచి ఉదయం 7 గంటలకు స్కూటర్ ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. ప్రజలు శోభా యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, భారవి, సురేష్‌వర్మ, లక్ష్మణరావు, శోభా భాయ్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు తీసుకురావడంలో ప్రభుత్వం విఫలం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు తేవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎటువంటి కృషి చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా నిధుల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు.

సబ్సిడీ లోన్స్ ఇవ్వాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బీసీ కార్పొరేషన్ తరహాలోనే ఎస్సీ, ఎస్టీ , మైనారిటీలకు సబ్సిడీ లోన్ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానించాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కే.సి. బాదుల్లా, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. మునెయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ అధికారులు యాక్షన్ ప్లాన్ తయారుచేసి ఆన్‌లైన్ దరఖాస్తులు సైతం ఇప్పటికే రెండు సార్లు పొడిగించిన పరిస్థితి నెలకొన్నదని గుర్తు చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారని, మరో 45 రోజులు మాత్రమే ఆర్థిక సంవత్సరం మిగిలి ఉన్నదన్నారు. అందువల్ల యుద్ధ ప్రాతపదికన ఎస్సీ ఎస్టీ మైనారిటీ కార్పొరేషన్ అధికారులు యాక్షన్ ప్లాన్ అమలుకు ముందుకు రావాలన్నారు. ఇమామ్, మౌజన్‌లకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గౌస్ నాయకులు యస్.దస్తగిరి పాల్గొన్నారు.

కొత్త వక్ఫ్ చట్టాన్ని ప్రతిఘటిస్తాం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పార్లమెంటులో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు పూర్తిగా మద్దతు తెలిపిన తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు మైనార్టీలకు తీవ్ర ద్రోహం చేశారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజమెత్తారు . శుక్రవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కొత్త చట్టం అమలును ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర హజ్ కమిటీ మాజీ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ మయాన రహమతుల్లా ఖాన్, కాంగ్రెస్ పార్టీ మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం. వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేతలు శ్యామలమ్మ, సంజయ కాంత, రఫీ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 16వ తేదీ కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబోయే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్‌ఎస్‌యూ ముద్రించిన ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, నగర అధ్యక్షుడు హరిబాబు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు లోకేష్, జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

16న ఆధ్యాత్మిక కార్యక్రమం

కడప కల్చరల్: కడప నగరం అగాడిలోని గోల్డెన్ సంఘం ఫంక్షన్ ప్యాలెస్‌లో ఆదివారం ఇస్లాం ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రూబురు రిష్త ములాఖత్ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ముస్లింలకు ఎంతో ఉపయుక్తమైన ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కల్చరల్ : శ్రీ విజయదుర్గ, మల్లికార్జునుల కల్యాణోత్సవాన్ని శుక్రవారం కమనీయంగా నిర్వహించారు. అమ్మవారు కడప నగరంలో కొలువుదీరిన రోజును పురస్కరించుకుని ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు 25 కలశాలలోని పవిత్ర జలాలతో విశేష అభిషేకాలు, అలంకారం చేశారు. యాగశాలలో చండీహోమం, ఆలయ మండపంలో నవావరణ శ్రీ చక్రార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్, కుటుంబ సభ్యుల పర్యవేక్షణలో అర్చక బృందం కల్యాణ క్రతువును నిర్వహించింది. గణపతిపూజ, కలశ ప్రతిష్ఠ, కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, ప్రవరలు, సంకల్పం తదితర కార్యక్రమాలతో కల్యాణం నిర్వహించారు. అమ్మవారి కళ్యాణ మహోత్సవంలో భాగంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల ఆధ్వర్యంలో భక్తి పాటలతో కళ్యాణ మహోత్సవం ప్రారంభించారు. పండితుల మనోహర వ్యాఖ్యానాలు, వేద మంత్రాల నడుమ ఆదిదంపతుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమాన్ని ఆహ్లాదకరంగా నిర్వహించారు. రాత్రి శ్రీ విజయ దుర్గా దేవి సింహ వాహనంపై కొలువుదీరి కడప పురవీధుల్లో ఊరేగింపునకు బయలుదేరింది. విశేషంగా తరలివచ్చిన భక్తుల జయ జయ నాదాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. నగర వీధుల్లో రంగురంగుల విద్యుత్ దీపాల మధ్య అలంకరించిన పూల రథంపై స్వామి, అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. విచిత్ర వేషధారణలు, బాణాసంచా వెలుగులు ఈ ఉత్సవంలో ఆకర్షణగా నిలిచాయి. కల్యాణోత్సవంలో వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు.

- బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ప్రత్యేక పూజాధికాలు నిర్వహించనున్నారు. మహా పూర్ణాహుతి, ధ్వజావరోహణ, త్రిశూల స్నానం, పుష్పయాగం చేపట్టనున్నారు.

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న వైద్య అధికారులు



పాల్గొన్న హెచ్‌ఓడీలు, వైద్య సిబ్బంది

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ఖచ్చితంగా ఓపీ విధులను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తమ ఓపీ విభాగాలలో నిర్వహించాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రత్యేక పరిపాల అధికారి రంగస్వామి తెలియజేశారు. ఎవరైనా ఓపీ విధులకు డుమ్మా కొట్టినట్లు తెలిస్తే వారి ప్రైవేట్ క్లినిక్ లకు వెళ్లి ఫోటోలను తీసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని హెచ్చరించారు. శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్) లో ఐపీ భాగం లెక్చర్ గ్యాలరీలో వివిధ విభాగాల వైద్య అధికారులతో, వైద్య సిబ్బందితో అధికారులు ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. బయోమెట్రిక్, ఎఫ్ ఆర్ ఎస్, అటెండెన్స్ ద్వారా విధులకు హాజరైన వారు తమకు కేటాయించిన విధుల సమయాలలో ఖచ్చితంగా హాజరు లో ఉండాలని, అంకిత భావంతో విధులను నిర్వర్తించాలన్నారు. నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు బాధ్యతాయుతంగా వైద్యం నిర్వహించి, ప్రజల్లో మంచి పేరు తీసుకురావాలన్నారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఆర్ ఎం ఓ డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ రాజేశ్వరి, వివిధ విభాగాల హెచ్ఓడీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కమ్మ సంఘం' అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న కమ్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్డపనేని చంద్రశేఖర్‌నాయుడు

కడప రూరల్: ఇరు వర్గాలకు చెందిన వారు కమ్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేస్తే చట్టపరమైన చర్యలు చేపడుతామని ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దొడ్డపనేని చంద్రశేఖర్‌నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమ్మ సంక్షేమ సంఘానికి అధ్యక్షులుగా గడువు ముగుస్తున్న తరుణంలో గడిచిన జనవరి 20వ తేదీన కమ్మ సంక్షేమ సంఘానికి చెందిన కార్యకర్తలతో సమావేశం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా రెండు వర్గాలుగా చీలిపోయి తామే అధ్యక్షులము అంటూ ప్రకటించుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఒక వర్గానికి చెందిన చల్లా ప్రభాకర్‌నాయుడు ఈ నెల 15వ తేదీన, రెండవ వర్గానికి చెందిన పల్లినేని నాగేశ్వరనాయుడు 16వ తేదీన నూతన అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు పోటా పోటీగా ప్రకటించుకున్నారన్నారు. కాగా నిబంధనలకు విరుద్ధంగా ఇరువురి ప్రమాణ స్వీకారాలు చెల్లవని అన్నారు. ఎవరైనా సరే నిబంధనలను అతిక్రమించి ప్రమాణ స్వీకారాలకు సిద్ధపడితే వారిపై చర్యలు చేపడుతామని అన్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపామన్నారు. కాగా సంఘానికి సంబంధించి ఉమ్మడి జిల్లా శాశ్వత సభ్యులతో సమావేశం నిర్వహించి మంచి వాతావరణంలో నూతన అధ్యక్షుని ఎన్నిక ప్రక్రియను చేపడుతామని తెలిపారు.

ఇంటింటి న్యాయ ప్రచారంలో 7240 గృహాల సందర్శన



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్


కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇంటింటి న్యాయ ప్రచారంలో భాగంగా ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 7240 గృహాలను సందర్శించి అందులో 98 మంది ఎదుగుదల లోపాలున్న పిల్లలను గుర్తించామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ తెలిపారు. శుక్రవారం కడప నగరం మట్టిపెద్దపులి ప్రాంతంలో ఇంటింటి న్యాయ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 46 బృందాలు ఏర్పాటు చేసి ఇంటింటి న్యాయ ప్రచారాన్ని నిర్వహించి అర్హులను గుర్తిస్తున్నామన్నారు. వారికి తగు సహాయం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రత్యేక అవసరాలుగల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు, వైద్యాధికారులు, భవిత సెంటర్ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైవీయూ వీసీ చాంబర్ ఎదుట బైఠాయింపు



వైవీయూలో వీసీ చాంబర్ ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: నూతన జాతీయ విద్యా విధానం 20 – 20 లో భాగంగా మూడు సంవత్సరాల డిగ్రీ అని నాలుగు సంవత్సరాలు చేసి అదే కళాశాలలో హానర్స్ ఐదవ సంవత్సరానికి చదవడానికి అనుమతి లేదంటూ యూనివర్సిటీ అధికారులు చెప్పడం విచిత్రంగా ఉందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు అన్నారు. కడప ఆర్ట్స్ కళాశాలలో ఎం కామ్ లెటరల్ ఎంట్రీకి అనుమతి ఇవ్వాల్సిందేనని శుక్రవారం యోగి వేమన యూనివర్సిటీ వైస్ చాన్సులర్ చాంబర్ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ వైవీయూ రిజిస్ట్రార్ పద్మ 2025 జనవరి 7 తేదీన యోగి వేమన యూనివర్సిటీ అధికారులు లేటరల్ ఎంట్రీ అనుమతి ఉందంటూ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలకు పర్మిషన్ ఇస్తున్నామని నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. అయితే జనవరి 9న అధికారికంగా పత్రికా ప్రకటన కూడా విడుదల చేశారన్నారు. ఈ విషయాన్ని యూనివర్సిటీ అధికారులను అడుగుతుంటే అనవసరంగా విద్యార్థి సంఘాలు రాద్ధాంతం చేస్తున్నాయంటూ రిజిస్ట్రార్ మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రైవేట్ కళాశాలలకు అనుమతులు ఇవ్వడానికి చూపిన శ్రద్ధ ప్రభుత్వ కళాశాలకు అనుమతి ఇవ్వడానికి ఎందుకు లేదని అన్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ అధికారులు స్పందించి ఎం కామ్ లేటరల్ ఎంట్రీ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు అనుమతి ఇవ్వకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివశంకర్, నాయకులు చంద్ర, అరుణ్, తేజ, నాగార్జున, సాయి, మధు, సాయిరాం, హరిప్రసాద్, నరసింహ, మస్తాన్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సూర్యాస్తమయ వేళ..

భానుడి కిరణాలు నీటిలో పడిన వేళ సువర్ణ కాంతులతో ఇలా కనువిందు చేశాయి. దేవుని కడప చెరువులో శుక్రవారం సాయంత్రం సూర్యాస్తమయాన ఆకట్టుకున్న చిత్రాలివి. – రమేష్, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

మట్కా బీటర్లు అరెస్టు

కడప అర్బన్: కడప నగరం పాత బస్టాండ్ వద్ద మట్కా నిర్వహిస్తున్న ఇరువురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు వన్ టౌన్ ఎస్ఐ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. కడపకు చెందిన మున్నా, గౌస్ పీర్ మట్కా రాస్తున్నట్లు సమాచారం రావడంతో సీఐ రామకృష్ణ ఆదేశాల మేరకు సిబ్బందితో వెళ్లి అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 8,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అంత్యక్రియలు

కడప అర్బన్: జిల్లాలోని బి. కోడూరు మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో అనాథగా చనిపోయిన 60 సంవత్సరాల వృద్ధుడికి అంత్యక్రియలు చేయాలని బీ.కోడూరు ఎస్ఐ తెలిపారు. ఆయన విజ్ఞప్తి మేరకు శుక్రవారం మేము సైతం సేవా సంస్థ తరపున మోచం పేటలోని హిందూ స్మశాన వాటికలో అనాధ వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాము, అయ్యవారయ్య, గురువయ్య, రామరాజు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కుటుంబాన్ని ఆదుకోవడంపై హర్షం

కడప సెవెన్‌రోడ్స్ : గత ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ విశాఖ జిల్లాలో హత్యకు గురైన తహసీల్దార్ ఎస్.రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడం పట్ల జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు బీపీ వేదనాయకం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, రెవెన్యూశాఖ మంత్రి, సీసీఎల్ఏ కలిసి నియామకాల సడలింపుతో జీఓఎంఎస్ నెంబరు 46 రెవెన్యూ (సర్వీసెస్ 2) తేది 11.02.2025 జారీ చేశారన్నారు. ఈ మేరకు తహసీల్దార్ భార్య పోలకి అనూషకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కోటాలో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉద్యోగ అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు.

స్టాప్.. వాష్ అండ్ గో



వాహనదారులతో ముఖం కడిగిస్తున్న పోలీసులు

కడప అర్బన్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో గత రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు 'స్టాప్ .. వాష్ అండ్ గో' కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారుమాజున నిద్రమత్తు లేకుండా వాహన డ్రైవర్లకు నీరు అందించి ముఖం కడుక్కుని వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. వాహనదారులు, ప్రయాణికులు పోలీసుశాఖకు కృతజ్ఞతలను తెలియజేశారు.

కెనరా బ్యాంకు పథకాలు వినియోగించుకోవాలి



ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కెనరా బ్యాంకు సిబ్బంది, అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కెనరా బ్యాంకు ద్వారా మహిళల కోసం ప్రవేశపెట్టిన కెనరా ఏంజిల్ డ్రీమ్ బియాండ్ బౌండరీస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ కె.మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం కడప నగరంలో డోర్ టు డోర్ క్యాంపియన్స్‌పై ఫిక్స్‌డ్ డిపాజిట్, అధిక వడ్డీ రేట్ల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ కెనరా ఏంజిల్ అకౌంట్స్‌ను తెరవడం వల్ల క్యాన్సర్ కేర్ ట్రీట్‌మెంట్ ఫ్రీగా అందిస్తామన్నారు. ఈ విషయమై నెహ్రూ పార్కు, కడప ఆర్ట్స్ కళాశాలలో ర్యాలీ నిర్వహించామన్నారు. కేన్సర్ కేర్ ట్రీట్‌మెంట్‌కు రూ. 10 లక్షల వరకు అందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆఫీసు ఏజీఎం రత్న, డీఎం అరుణజ్యోతి, కడప రీజినల్ ఆఫీసు ఎగ్జిక్యూటివ్స్ రమేష్, షరీఫ్ అహ్మద్, విలియమ్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగ!

కడప అర్బన్: కడప నగరంలోని వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న బంగారం దుకాణాలను గత రెండు రోజులుగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లాలో కడప నగరం తో పాటు ఇతర పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

23న రాయలసీమ మాలల యుద్ధ గర్జన సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రామోజీ ఇమ్మానుయేల్ తదితరులు

కడప రూరల్: రాజ్యాంగానికి విరుద్ధంగా చేపడుతున్న ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 23వ తేదీన కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే రాయలసీమ మాలల యుద్ధ గర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని మాల మహా సభ వ్యవస్థాపకులు మల్లెల వెంకటరావు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు రామోజీ ఇమ్మానుయేల్ తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఈ మేరకు వారు కర పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశం రాజ్యాంగానికి విరుద్ధమని అన్నారు. దేశంలో ఆర్ఎస్ఎస్ రాజ్యాంగం నడుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘాల నేతలు వెంకటేశ్వర్లు, మేకల రవిరాజు, పాలెంపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పంచాయితీరాజ్ విభాగ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయితీరాజ్ విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సర డైరీని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం తన నివాసంలో పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డితో కలిసి ఈ డైరీ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం స్థాపనకు గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, స్థానిక సంస్థల బలోపేతం, ఆర్థికంగా వాటిని స్వయంసమృద్ధి చేసేందుకు తీసుకున్న చర్యలను ఈ డైరీలో ప్రస్తావించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మెన్ బాలయ్య, జెడ్పీటీసీలు వెంకట సుబ్బయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



భగత్ సింగ్ నగర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: దోమ కాటువలన వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక భగత్‌సింగ్ నగర్‌లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్ఓ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ రాత్రి వేళ దోమ తెరలు వాడాలన్నారు. పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను నిర్మూలించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుభాని, రమేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, నాగలక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన సిలబస్ రూపకల్పన



బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌ల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: జాతీయ విద్యా విధానం- 2020 ప్రకారం లెటరల్ ఎంట్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు నూతన సిలబస్ రూపకల్పన చేయనున్నట్లు వైవీయూ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి వెల్లడించారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలోని తన చాంబర్లో వైవీయూ అకాడమిక్ డీన్ ఆచార్య చంద్ర ఓబుల రెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ వసు గోవర్ధన్ రెడ్డి, వివిధ కోర్సుల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌లతో ప్రిన్సిపల్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొన్ని కోర్సులకు పాత సిలబస్, కొన్ని కోర్సులకు కొత్త సిలబస్ ఉందని తెలిపారు. అందరి అభిప్రాయాల మేరకు ఏకరూపంలో నూతన సిలబస్ రూపొందించాలని నిర్ణయించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి నూతన సిలబస్ అమలు చేయనున్నామన్నారు. ఈ సమావేశంలో బీఓఎస్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

నేడు రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం

కడప కోటిరెడ్డి సర్కిల్ : జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లాప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. తమ విధి నిర్వహణలో ఎక్కువ కాలంపాటు ప్రమాదాలు చేయకుండా విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్లను సన్మానిస్తామన్నారు. కార్యక్రమంలో కడప జోన్ ఈడీ చంద్రశేఖర్, లోక్ అదాలత్ జడ్జి, ఎస్పీ, రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ పాల్గొంటారన్నారు.